MB018 319 C

రంగుల కథలు



CI

48028519

శారదాకృతులు

H- 8-3
N- 56

INTERNATIONAL TELUGU INSTITUTE
Hyderabad - 500 027, India

శారదా అశోకవర్ధన్

వెల :
మూడు రూపాయలు

ప్రథమ ముద్రణ
ప్రతులు 1000

ముద్రణ
లలితా ప్రెస్
ఖైరతాబాదు, హైద్రాబాదు-4

ప్రతులకు :
దీపికా ప్రచురణలు
కాచేజి నం. 1, జన్నిలాల్ పేట్,
పి కిం ద్రా బా దు - 3.

వెల :
మూడు రూపాయలు

సర్వస్వామ్యములు
రచయిత్రివి

విషయ సూచిక

	పుట
అభినందన—సి. నారాయణరెడ్డి	
శారదాకృతి ప్రకృతి—పోతుకూచి సాంబశివరావు, మరోవిరి—	
ప్రస్తావన—శశాంక	డా. బాపురెడ్డి
వినతి—శారదా అశోకవర్ధన్	
స్మృతి–అంకితం	
అమ్మ	1
నవభారతనిర్మాణం	4
ఏల ఈ ఆక్రందన	8
మనిషిగా బ్రతకడం	11
ఇక భరించలేను	14
వెన్నెల రాత్రి	16
మందలింపు	19
శేషప్రశ్న	21
స్నేహమా విడిపోకునన్ను	24
ఇరువుర మొకటై నడవాలి	26
ఎవరు నేర్పారు నీకు?	23
నీ మొహం చూసేదెవరు?	29
ఆమెకేంతెలుసు?	32
కాలసముద్రం	35
నీదే ఈ భవిష్యత్తు	37
అందుకే నే ప్రాకులాడుతున్నది	40
ప్రేమంటే తెలుసుకో	43
నిజమేలేపాపా నువ్వు చెప్పింది	45

జీవితం నావ	48
మనిషి మనిషిగా బ్రతక లేకపోతున్నాడు	50
నాకంటే బాగా తెలుసా నీకు?	52
సృష్టిలో రహస్యం	54
జ్ఞాపకం	57
విజయదశమి	59
కుడి ఎడమలు	61
మనిషి ఎదగాలి	63
ఈ దీపం ఆరిపోకూడదు	65
నవ్వు	67
కుక్కకాటుకు చెప్పుదెబ్బ	69
మమతల మడతల్లో సంక్రాంతి	72
పిలుపులో ఏముంది?	74

అభినందన

శారదాకృతులు చదివాను. ఈ కృతులన్నిటికీ భావుకత ప్రాణం. అసలు—కవితల ఎత్తుగడల్లోనే అది జుమ్మనిపిస్తున్నది.

'స్నేహమా విడిపోకు నన్ను
నీవులేకుంటే లేనేలేను నేను'.
లోకానికి వెలుగునిచ్చే ఓ దివ్వే
వేడిమిలో కాలిపోదువా నువ్వే.

ఇవి శారద సుకుమార భావుకతను పట్టిచూపే శీర్షికల ప్రథమపంక్తులు.

అన్ని కృతులలో ఆర్ద్రంగా వున్న రచన 'వెన్నెల రాత్రి'. మామూలుగా మొదలవుతుందిది 'వలపులు చిందించే పసిడి వెన్నెల రాత్రి'గా. అదే వరసలో తీగసాగితే నేను వేరొకనవలసిన అవసరం ఉండేదికాదు. ఈ వెన్నెల రాత్రి ఎన్నో అంచులు కలిగింది. తల్లుల కది 'పాలవెన్నెల రాత్రి' అట. పండువెన్నెల, పాలవెన్నెల కొత్త పదబంధాలేమీకావు. కాని తల్లుల దృష్టికి—పాలవెల్లుల దృష్టికి—ఆ వెన్నెల పాలవెన్నెల కావడం ఔచిత్యం పొదుగు చేపడం.

అదే వెన్నెలరాత్రి లేనివాళ్లకు మహాశివరాత్రి. పరిస్థితుల సంకెళ్లలో చిక్కి విలవిలలాడే మానినులకు 'మాయదారి రాత్రి' అట. కటికి సత్యాన్ని ఎంత గుండెదిటవుతో చెప్పగలిగింది శారద! అందుకే ఈ 'వెన్నెల రాత్రి' నన్ను అంతగా ఆకర్షించింది. శారద భావుకతకూ, పదప్రయోగ నిపుణతకూ ముకురాయమానంగా నిలిచిన ఖండకృతి ఈ 'వెన్నెల రాత్రి'.

రానున్న శారదా కృతులు భావకతతో పాటు ప్రౌఢకవితా శిల్పాన్ని కూడా పొదుగుకోవాలి. ఈ సంపుటి అందుకు నాంది. ఆ దృష్టితోనే నేను వర్ధమాన కవయిత్రి శారదను అభినందించింది.

'త్రివేణి'
హైదరాబాదు-20.
29-1-72

సి. నారాయణరెడ్డి

శారదాకృతి ప్రకృతి

"శారదా కృతులు" శారదకు నీరాజనాలు. రచయిత్రి శారద వలెనే శారదాకృతులు నిండుతనం సంతరించుకున్నాయి. శారదా కృతుల ప్రకృతి, రమణీయమైన ప్రకృతివలెనే అనంత సౌందర్యం; అగాధభావ స్వరూపం.

వచన కవితాయుగం సాహితీ రంగంలో ఆవిర్భవించి, అభ్యుదయ పథంలో పురోగమిస్తున్న ఈరోజుల్లో శారదకు నీరాజనాలు అనేకం వెలువడుతున్నాయి. రచనారీతి సౌలభ్యం, భావప్రకటన ప్రదర్శనకు నిజాయితీ నిదర్శన, యీ వచన కవిత కలంకారాలు. పూర్వ కాలపు కవిలోని అసామాన్యతను, వచనకవిత సామాన్యంగా మార్చింది. ఈ మార్పు వరవడులకు వరవడులు దిద్దడానికి ప్రయత్నించారు రచయిత్రి ఈ గ్రంథంలో. శారదకు శారద పిలుపు అందింది. పిలుపు ఎలా, ఎందుకు, ఎప్పుడు అందుకోవాలో గ్రహించుకున్న రచయిత్రి పలుకుతుంది —

పిలుపులో ఏముంది ? అంతా
తలపులోనే వుంది, చూపే
మమతలోనే వుంది, దాగిన
మనసులోనేవుంది. — అంటూ.

అర్థమయిన హృదయాలు పరస్పరం హత్తుకు పోగలవు. ప్రేమలోని ఇంద్రధనుస్సుల రంగులు, మనిషి మనీషిగా తిరగవలసిన మలుపుల బాటలు, నవ్వుల పువ్వుల జ్ఞాపకాలు, బ్రతుకు సంద్రంలో ప్రయాణించు నావికునివంటి జీవి భావి, వెన్నెల రాత్రిలో బ్రతుకుల వెలు

గుల అలలు, — ఇవి రచయిత్రి ఇతివృత్తాలు. — యీ కవితా గూఢ భావాలు వ్యర్థంకాని అర్థాలుగా పాఠకుల హృదయాలకు హత్తుకుపోగలవు —

మనిషి ఎదగాలి — మరి మరుపురాని జ్ఞాపకంగా, నవభారత నిర్మాణం — ఆ దీపం ఆరిపోకూడదంటూ — రచయిత్రి కన్న కలలు చిరస్మరణీయాలు.

జాతిని జాగృతం చేయడానికి
పవిత్రమైన శాశ్వతమైన
ప్రేమానురాగమే మార్గం కావాలి —
రచయిత్రి కంఠశోష కాదిది —
శోష, మధుర స్వరంగా మారి
కంఠాన్ని సరస్వతీ పీఠంగా
మార్చుకుని, అర్చనద్వారా,
సాహితీ వర్చస్సు సంతరించు
కున్న యీ శారద కవితామాల
నవ సుమాలమాల శారదాదేవికి
నిత్య నీరాజనంగా విరాజిల్లగలదని
నా ఆశ; విరాజిల్లవలెనని నా ఆకాంక్ష.

పోతుకూచి సాంబశివరావు.

మరో విరి

కోకొల్లలుగా వచన కవితలు వెలువడుతున్న రోజులివి. పాఠకుల హృదయాలను సులభంగా ఆకట్టుకొనే కవితా ప్రక్రియ ఈ వచనగేయం. దీన్నే నేను గద్యకవిత అన్నాను. పద్యకవిత — గేయ కవిత — వచన కవిత — మూడు పాయలుగా ప్రవహిస్తున్నది తెలుగు కవితా గోదావరి నేడు. అయితే యువ కవులను ఎక్కువగా ఆకర్షిస్తున్నది వచన కవితయే.

ఆధునిక సాహిత్యంలో కథలకూ, నవలలకూ ఉన్న ఆదరణ కవితకు లేదు — ఉండడానికి వీలులేదు కూడా. జన సామాన్యానికి సూటిగా అర్థమయేది వ్యావహారిక భాషలో వ్రాసిన వచనం. ఈ సత్యాన్ని గ్రహించిన యువతీ యువకులు తమ భావాలను కవితలో చెప్పవలసివచ్చినప్పుడు వచనకవితలో ప్రకటిస్తున్నారు. సభల్లో, సమావేశాల్లో వచన కవితాపఠనానికి వచ్చినన్ని "చప్పట్లు" ఇతర ప్రక్రియాగతమైన కావ్యాలకు రాకపోవడంకూడా ఈ వచన కవితా విజృంభణానికి ప్రధాన కారణాలల్లో ఒకటి. ఛందస్సు, మాత్రాఛందస్సుతో నిమిత్తం లేదు కాబట్టి వచన కవితా రచన కలం పట్టిన ప్రతి రచయితకు కల్పతరువైంది.

అయితే కవిత రాణించాలంటే ప్రక్రియకన్న ప్రతిభ, భావశబలత ముఖ్యం అని వేరుగా చెప్పనక్కరలేదు. అందుకే ప్రజాదరణ పొందిన కవిత నాల్గుకాలాలపాటు నిలిచిన కవిత అన్ని ప్రక్రియల్లోను కానవస్తున్నది. ఏ ప్రక్రియలో వ్రాసినా, ఎంత గొప్ప వస్తువును తీసుకొని వ్రాసినా భావపుష్టిలేని కవితలు కాగితపు పూవులై పోతున్నాయి.

ఈ "శారదా కృతులు" కవితా మహోద్యానంలో పూచిన

మరో క్రొత్త విరి. కవయిత్రి శ్రీమతి శారదా అశోకవర్ధన్ ప్రతిభా లతపైవికసించిన తొలిపుష్పం ఇవి. ఈలత అమ్లానసుమాలెన్నో విరియ బూస్తుందని, అద్భుత సౌరభాలు వెదజల్లుతుందన్న ఆశాభావం కల్గి స్తున్న భావ రేఖల్ని చూడండి.

"సృష్టికర్త ఒక్కడే
మానవాళి ఒక్కటే
మాటతీరు వేరైనా
మతాలన్ని ఒక్కటే"

"అన్యాయం అధికమయింది
అశ్లీలం పెరిగింది
స్వార్థం రొమ్ము విరుచుకు తిరుగుతోంది"

"మంచిని పెంచి
నలుగురికీ పంచి
హాయిగా జీవించు"

"అందంగా కనిపించే గులాబీకి
ఎన్నో ముళ్ళా !
తియ్యగా కనిపించే జీవితం వెనకాల
ఎన్నో చీకట్లు !
ముళ్లు గుచ్చుకోకుండా గులాబీలు కోసుకోవాలి
చీకట్లు చిమ్మకుండా జీవితాన్ని దిద్దుకోవాలి"

ఈ కావ్య సంపుటిలో ఇలాంటి ఉషోరేఖలు చాలా ఉన్నాయి. జీవితాన్ని, సమాజాన్ని పరిశీలించి తదనుభూతిని కళాత్మకంగా అందిం చాలనే ప్రయత్నం ఇందులో అడుగడుగునా కనిపిస్తుంది.

"కట్నాల బరువుతో క్రుంగిపోతున్న
కన్నవారి కష్టాలను చూడలేక
కన్నీరు కార్చే కన్నియ"కు

వెన్నెలరాత్రి, కాళరాత్రిగా భాసించింది శారద కవితా హృదయంలో.

"నీలో ముసిరిన చీకట్లు
నా నవ్వుల వెలుగుల పోవాలి
నీలో నిండిన ఇక్కట్లు
నా చెలిమికి బలియై పోవాలి" అనే

ఉన్నతాదర్శ శిఖరాలనుంచి వినిపిస్తుంది ఈమె వాణి. "పెట్టి వల్ అడ్వాన్సు పెడితే, ఆ పండక్కే అకౌంటెంటు పదిరోజులు శెలవు పెట్టా"డని నిత్య సత్యాలను ముత్యాల మాలగా అల్లుకొంటున్నది ఈ కవయిత్రి భావనా కన్య.

"ప్రేమంచే తెలుసుకో
ప్రేమించడం నేర్చుకో"

అని ప్రబోధిస్తున్నది ద్వేష విషం గ్రక్కే సంఘ సర్పాన్ని.

"మనిషి ఎదగాలి
మరెంతో పెరగాలి" అంటున్న ఈమె ప్రతిభా పాండిత్యాలు కూడా ఎదగాలి, పెరగాలి అని ఆకాంక్షిస్తున్నాను. కవితా రంగంలో కవయిత్రుల కొరతను కొంతవరకు తీరుస్తున్న శ్రీమతి శారదను అభినందిస్తున్నాను.

— జె. బాపురెడ్డి

ప్రస్తావన

శారదాకృతులంటే శారదచేత రచింపబడ్డ కృతులనీ, లేదా శారద యొక్క ఆకృతులనీ రెండర్థాలు చెప్పుకోవచ్చు. ఆకృతి అనే మాటకు రూప మని, భావ సంజ్ఞ అనికూడా అర్థం. ఇప్పుడీపుస్తకం యావత్తు శారద హృద్గత మైన భావాలకు రూపకల్పన చేస్తోంటే నేను ఆ 'శారద' యొక్క ఆవిర్భూతికి దోహదం చేసిన పరిస్థితుల్ని గూర్చి ప్రస్తావించడానికి పూనుకుంటున్నాను.

శారద - అంటే - మా గాడేపల్లి జగన్నాథం గారి కోడలు - అంటే మా అశోక్ భార్య - అని పరిచయం చెయ్యడం ఈ సందర్భంలో ఉచితం కాదు. ఏమంటే ఆ జగన్నాథంగారు కాని. ఆ అశోక్ కాని ఈ పుస్తకం చదవబోయేవారికి ఇదివరకే తెలిసి ఉండడానికి తగిన సావకాశం లేదు. నేక పోయినా ఆ జగన్నాథం గారి మీదా, ఆ అశోక్ మీదా శారదకీ నాకూ ఉండా గౌరవం; అభిమానం. అందువల్ల అలా చెప్పాలనే చెప్పాను.

ఆ శారదకి అటు పుట్టినింటిలోనూ, ఇటు మెట్టినింటిలోనూ కూడా లభించిన ప్రోత్సాహంవల్ల ఆమె ఎట్టని కళారూపమే లేదు. చిన్నప్పుడు స్కూల్లో చదువుకునే రోజుల్లో తనకు నచ్చిన సినీమా పాటల వరసల్లో మేష్టర్లమీద పాటలు కట్టి అమర గాయనిలా పాడేసింది. దానితో సహపాఠు లందరూ తనకు శిష్యులై తానొక కవయిత్రి అయికూర్చుంది. ఆ తర్వాత అలాగే దేవుళ్ళమీద వచ్చిన సినీమా వరసల్లోని పాటలు ఇరుగు పొరుగువాళ్ళని ఆకర్షించాయి. ఆరోజుల్లో తానే కవయిత్రి — తానే గాయని!

ఆ ఖ్యాతి తోటే ఆమెకు స్కూలు నాటకాలలోనూ ప్రవేశం దొరికింది. ఎన్నో నాటకాలలో ఎన్నో రకాల వేషాలు వేసింది. మొత్తంమీద స్కూలు గోడలు దాటి బయటి ప్రపంచంలో పడకుండానే ఆమెకు సంగీతంతో, కవి త్వంతో, నాటక కళతో పరిచయం ఏర్పడింది. ఆ అనుభవాన్ని పురస్కరించు కొని ఆ తర్వాత రేడియో నాటకాలలోకి చొరబడింది శారద. రేడియో నాట కాలు రంగస్థలం మీదికి లాగేయి శారదని; అప్పటికింకా శారదకి పెళ్ళి

కాలేదు. స్కూలూ, కాలేజీ నాటకాల వరకే పర్మిషనిచ్చిన కన్నతండ్రి కట్టడి చేశారు. దానితో అన్నీ కట్టుబడి పోయాయి. అప్పటినుంచీ తన కళాభిమాన మంతా కలంలోనే రంగరించి ఎన్నో రచనలు చేసింది.

ఏమి వ్రాసినా కవిత్వం జోలికి మాత్రం చాలాకాలం పోలేదు శారద. ఏవో కథలూ, నవలలూ, నాటకాలూ వ్రాసుకుంటూ అక్కడితోనే సరిపెట్టుకుంది. ఆ కథల్నీ నాటకాల్నీ చదివిన వాళ్ళూ, చూసినవాళ్ళూ మెచ్చుకొన్నారు. తానెప్పుడో రంగస్థలానికి స్వస్తి చెప్పినా తాను వ్రాసిన నాటకం మాత్రం ఒక సారి రంగస్థలాని కెక్కించి: రసజ్ఞుల మనసుని కెక్కించి. దానితో తన రచనలు చూసి ఎవ్వరేమనుకుంటారో అన్న భయంపోయి వచ్చినదేకో ధైర్యంగా వ్రాయడం అలవాటైంది. దానికితోడు మొన్న మొన్నటి వరకూ రేడియోలో తాను చేసిన ఉద్యోగం తన రచనా వ్యాసంగానికి దోహదం చేసింది. రేడియోలో ఉండగా తాను వ్రాసిన నాటకాలూ, పాటలూ, ప్రసంగాలూ, పరిచయాలూ శారద కెంతో ఆత్మ విశ్వాసాన్ని కలిగించాయి. అప్పటినుంచీ శారద గడిచేరింది !

గడచిన ఆరు నెలల వరకూ కవిత్వం దరిదాపులకే పోని శారద ఈవేళ "శారదా కృతులు" అన్న కవితా సంకలనాన్నే ప్రచురిస్తోంది. ఇందులోని కవితలు డా. సి. నారాయణ రెడ్డి, బోయి భీమన్న, బాపురెడ్డి వంటి ప్రఖ్యాత కవుల మన్ననలనే అందుకున్నాయి. ఈ పుస్తకానికి "శారదా కృతులు" అన్న నామకరణం శ్రీ నారాయణరెడ్డి గారే చేశారు.

అసలీ కవిత్వ గందర గోళంలో తాను ఎలా పడిందో తనకే తెలియదంటుంది శారద. నిజానికి కవిత్వమంటే తనకి చాలా భయం. అదేదో తనది కాదనుకునే ఇంతకాలం దూరంగా ఉంటూ వచ్చింది. అయితే అంతరాంతరాల్లో మాత్రం కవిత్వమంటే వల్లమాలిన అభిమానం తనకి ! స్వయమైన అనుభూతుల్ని ప్రకటించుకోడానికి నిజానికి కవిత్వాన్ని మించిన బలమైన సాధనం మరొకటి లేదు. అయితే ఆ కవిత్వానికి ఇదివరకైతే చాలా కట్టుబాట్లు ఉండేవి. దాని చేరువకి పోడానికి సామాన్యులకు సాధ్యపడేది కాదు. ఇప్పుడలాంటి కట్టుబాట్లేవీ ఉన్నట్లుగా కనిపించలేదు. లేకపోయినా అవి ఉన్న కవిత్వంకన్న ఈ లేని కవిత్వమే ఈనాడు జనాన్ని రంజింప చెయ్యడం కవి సమ్మేళనాలలో తాను స్వయంగా చూసింది. మరి తనకీ గాఢమైన అనుభూతు

లున్నాయి – ఇంకేం – ఈమాత్రం చెప్పలేమా అనిపించింది. కాయితంమీద కలంపెట్టి వ్రాయబోతే ప్రతిదీ కవితగా అవతరించింది. ఆయా కవితల్ని ఆంధ్ర జనత, ఆంధ్ర భూమి, ఆంధ్ర ప్రభ, తరుణ, ఉజ్జీవన మొదలైన పత్రికలు ఆదరించి ప్రచురించాయి. ఆకవితలు పఠింపబడ్డ సభలు ఆనందంతో కరతాళ ధ్వనులు చేశాయి. ఆ యీ పరిస్థితులు శారదని ఈ పుస్తకం వెయ్యడానికి ప్రేరేపించాయి. ఇప్పుడీ పుస్తకాన్ని ఆంధ్రలోకం ఎలా స్వీకరిస్తుందో ఎదురు చూడాలి.

ఈ పుస్తకంలో ఎన్నో విషయాలమీద రకరకాల ఖండికలు ఉన్నాయి. వాటన్నిటిలోనూ శారదయొక్క అర్ద్రితా ఆదర్శమూ తొంగిచూస్తూ ఉంటాయి.

"మానవతకు నీళ్ళుపోసి పెంచి
మమతలకు పందిరేసి ఉంచి
న్యాయానికి నిచ్చెనలు కట్టి
సమాజాన్ని ఉద్ధరించాలి
సమానత్వాన్ని సాధించాలి
సంతోషాన్ని స్థాపించాలి"

అన్న శారద కలలు ఫలిస్తే లోకమూ సుఖిస్తుంది.

--శశాంక.

వినతి

జీవితంలో ఏదో చెయ్యాలనీ, ఏదో ఐపోవాలనీ అనేక రకాల కలలు కంటూ వుంటాం. కానీ, ఎప్పుడు ఏ మలుపు తిరుగుతామో ఏ తీరం చేరుకుంటామో చివరిదాకా మనకే తెలీదు. నన్ను పెద్ద డాక్టర్ని చెయ్యాలని నా చిన్నతనంలోనే మా నాన్నగారి ఊహలు. నా చురుకుదనం. తెలివి తేటల్నీ చూసి, నాన్న ఊహల్ని సమర్థించిన అతి సన్నిహితులలో స్వర్గీయ బూర్గుల రామకృష్ణారావుగారు ముఖ్యులు. శారదాంబాక్ ఎం. బి. బి. యస్. అంటూండే వారు సరదాగా. అయితే నా దృష్టి ఎప్పుడూ మంచి పాటలవైపూ, మంచి నాటకాలు. సినిమాలవైపు మారుతూండేది. నాకు నచ్చిన పాత్రలు మనస్సుకు హత్తుకుపోయి రకరకాల ఊహలు నన్నావరించేవి. స్కూలులో, కాలేజీలో, నేను లేని నాటకమంటూ లేదు. ఆ రోజులలో నాకు తోచిన విధంగా పాటలు వ్రాయటం, కథలల్లటం చేసేవాన్ని. నాన్నగారి పరిస్థితులు కొంచెం తారుమారయ్యాయి. మెడికల్ కాలేజీకి వెళ్ళనన్నాను. ఆవిధంగా డాక్టర్నవుతాననుకున్న నేను ఏక్టరునయి (actor) చాలాకాలం వరకు కాలేజీలోనూ, రేడియోలోను స్థిరపడ్డాను. కానీ అది నాధ్యేయం కాదుగా ? ఏదో కావాలి – మరేదో అవ్వాలి– ఆ అయోమయావస్థలో నాచుట్టూ మూగిన భావాలకొక రూపకల్పన చేసేదాన్ని.

నేను వ్రాసిన ప్రతి కథకీ, నన్ను కదిలించిన ఏదో ఒక సంఘటనల నీడ కొద్దో గొప్పో ఉందనే చెప్పొచ్చు. నా మొదటి కథ "వర పరీక్ష" 1957 సంక్రాంతి ప్రత్యేక సంచిక "ప్రజామత'లో పడింది. అప్పుడు మా పక్కింటి అమ్మాయి పెళ్లిచూపులకొచ్చిన ప్రబుద్ధుల ప్రశ్నలే. నేనా కథ వ్రాయటానికి. కారణమయ్యాయి. అలాగే నన్ను కదిలించిన మరో సంఘటన. సత్య హరిశ్చంద్రుడు కాకపోయినా. అబద్ధాలకోరుకాని వ్యక్తి. కేవలం వ్రాగుడు వ్యసనం ఉండడం వల్ల, లోకం అతనిని ఏవిధంగా చూస్తుందీ, ఆ అవకాశాన్ని వినియోగించుకుని, గ్రామంలో పెద్దమనిషిగా చెలామణీ అవుతూన్న పెద్ద లందరూ, వారి నేరాలు అతనిపై రుద్ది, డబ్బుతో న్యాయాన్ని కొనుక్కుని,

ధర్మాన్నే శిక్షించిన ఉదాత్తగాధ. ఇది వ్రాయటానికి కారణం మా పనిమనిషి మొగుడు. వాడి జీవితం నేనా కథ వ్రాయటానికి కారణమయింది. ఆ కథ పేరే "తాగుబోతు". అనాధశరణాలయంలోని పిల్లల్ని చూసినప్పుడు, నా హృదయం ద్రవించి పాడే సమయంలో రచించిన కథ "అనుబంధాలు". "కలలపంట", "రాలని బాష్పాలు", "నిప్పులేని పొగ" మరెన్నో ఇతర కథలు. నాలో ఉరకలువేసే ఉత్సాహానికి తోడు. నాతోపాటు పెరుగుతూన్న భావనాశక్తి "అడుగుజాడ" అనే నవల వ్రాయటానికి తోడ్పంది.

మనఃఫలకంపై మెదిలే అనేక భావాలకొక రూపకల్పన చెయ్యటానికి కవిత .గొప్ప ఆయుధం. ఆ ఆయుధాన్ని చేబట్టి యత్నించిన నేను, నాలో మూగిన ఊహలకొక రూపాన్ని కూర్చగానే. ఏదో తెనియని ఆనందం, ఒక రకమైన తన్మయత్వం నన్ను పరవశింపజేసేవి. నిత్యజీవితంలో అడుగడుగునా, గుండెలు పిండే సంఘటనలూ కొన్ని, మనోవికాసాన్ని కలిగించే సంఘటనలు కొన్ని, ఉల్లాసపరచే సంఘటనలు కొన్ని ఉంటూనే వుంటాయి. వాటికి రూపాన్ని సృష్టించి చిత్రీకరించినప్పుడే ఏదో ఉత్తేజం ఉల్లాసం కలుగుతుంది, ఆ రచనలు ఆదరణ పొందినప్పుడు, మనస్సు ఆనందడోలికల్లో తేలిపోతుంది.

దానికితోడు, నన్ను సదా ప్రోత్సహించే పలువురు ఆత్మీయులు. శ్రీయుతులు నారాయణరెడ్డి, బోయి భీమన్న, బుచ్చుపెద్ది, శశాంక, పోతుకూచి సాంబశివరావు, పాలగుమ్మి విశ్వనాథం, జనమంచి రామకృష్ణ, గోపాలశాస్త్రి, కప్పగంతుల లక్షణశాస్త్రి, సండూరి విఠల్ మొదలగు వారంద రూను. వీరి ఆదరణలో నా రచనలు ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించు కున్నాయి. దాంతో నేను ధైర్యంగా మరీ ముందుకు పోగలిగాను.

ఇంట గెలిచి రచ్చగెలవమన్నారు. కేవలం స్నేహితులు, శ్రేయోభి లాషుల అభిమానమే కాకుండా. నాకు పుట్టినింటినుంచీ, మెట్టినింటినుంచీ కూడా తగిన ప్రోత్సాహం లభించడంతో నా కార్యసాధన మరింత సులభ మవ్వడమే కాకుండా. ఆనందదాయకమయింది. మా మామగారూ, మావారూ కూడా కళాభిమానులు, మా అత్తగారు శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు. కళా

నిలయమైన మా యింట్లో కళా గౌరవం సదా లభించడంతో నా ఈ తొలికృతిని ఆమెకే అంకితమివ్వడానికి కారణభూతమయింది.

నన్ను సదా ప్రోత్సహించి, గౌరవించిన స్నేహితులకీ, పాఠకులకీ కృతజ్ఞతలు తెలుపుకుంటూ అడిగిన తక్షణం ముఖచిత్రం తీర్చిదిద్దిన ప్రఖ్యాత కళాకారుడు శ్రీ హనుమాన్‌సూరిగారికి ధన్యవాదాలు తెలిపుతూ, "శారదా కృతులు" పాఠకలోకానికి అందిస్తూ సర్వదా ఈ అదృష్టం కలగజెయ్యమని భగవంతుని ప్రార్థిస్తున్నాను.

—శారదా అశోకవర్ధన్.

కృతి గ్రహీత్రి



కీ॥ శే॥ గాడేపల్లి రాజరాజేశ్వరిగారు

అంకితం

అమ్మవై నా
అత్తమ్మవై నా
లేదు నీకాభేదం
వేరు నీ నైజం.

నవనీతం నీ హృదయం
విరిమల్లెలు నీ మమతలు
ఏరితి తెలుపుదు నీ స్వభావం
సదా నా మదిలో మెదిలే
నీ ఛాయల ప్రభావం.

కన్నతల్లినే మరపించిన నీ ఆప్యాయత
మరపురాని మరువలేని కరదీపిక
కష్టాలలో సయితం చెరగని నీ చిరునవ్వు
నా పరితప్తహృదయానికోక వాడని పువ్వు.

నీ ఎనలేని అనురాగం
మరెన్నడూ కనలేని
మధురానురాగం.

లోకం నీవిక లేవంటుంది,
నా మనస్సది కాదంటుంది
నిలిచావు మా అందరిలో ఇలవేలుపుగా
మలిచావు మా అందరి జీవితాల పూలబాటగా.

వెలిగించాపు ఆరని దీపాన్ని
గాడేపల్లి వంశంలో
వెలిగాపు ధ్రువతారలా
మా గృహంలో
మెలిగావు సకల సద్గుణాలరాశిగ
రాజిల్లావు రాజరాజేశ్వరమ్మగ
అమ్మలాంటి అత్తమ్మా
వినవమ్మా నీ శారదశ్రుతులు
అందుకోమ్మా నా నమస్కృతులు.



అమ్మ



నవ మాసములు మోసి
నను గన్న మాయమ్మ
నను జూసి మురిసేను
మనసార పిలిచేను.

ఆ పిలుపులో వుంది
సరికొత్త రాగం
ఆ పలుకులో వుంది
మృదు మధుర భావం——

అమ్మ అనే తలపులో
కమ్మదనం వుంది
అమ్మ చూపు ప్రేమలో
వెచ్చదనం వుంది.

పలుకలేని పసిపాపకి
మాటనేర్పును తల్లి
ఎగురలేని పసిగుడ్డుకి
ఎగుర నేర్పును పక్షి.

మమతానుబంధాలకి
మాతృహృదయం నిలయం

సమతా స్వభావానికి
తల్లి గుణమే సాక్ష్యం.

మన్నించును ఎన్ని
తప్పులనైన
ఒప్పులుగా నెంచి
ప్రేమించును ఎట్టి
వారినైన
అన్నీ మరచి
అమ్మ అనే తలపులో
కమ్మదనం వుంది
అమ్మచూపు ప్రేమలో
వెచ్చదనం వుంది.

అమ్మ అనే మాటలో
హాయి ఎంతో వుంది
అమ్మ పేరు తలిస్తే
బాధంతా పోతుంది.


అమ్మఅనే రెండక్షరాలూ
జీవితంలో చెరగని శిలాక్షరాలు.
ఆపదలో వున్నా
ఏ పనిలో వున్నా
అమ్మా అనే మాట
అలుపుతీర్చు పాట
అనునయించు మాట
అనురాగపు బాట

ఆనందాల మూట
అమ్మ అనే తలపులో
కమ్మదనం వుంది
అమ్మచూపు ప్రేమలో
వెచ్చదనం వుంది.

అమ్మపెట్టు పాలబువ్వ
ప్రాణమిచ్చు అమృతం
అమ్మపాడు జోలపాట
సాటిలేని దీవెన.

అమ్మ అనే రూపమే
ప్రత్యక్ష దైవము
అమ్మలో ఒక భాగమే
జీవమున్న మనము.

అమ్మ అనే తలపులో
కమ్మదనం వుంది
అమ్మచూపు ప్రేమలో
వెచ్చదనం వుంది.



నవభారత నిర్మాణం

కన్నతల్లి రక్షణకోసం
కంకణం కట్టుకున్న వీరులు
ఎందరో!!
ఎందరో మహానుభావులు
అందరికీ వందనాలు.

తెల్లవారి దొరతనంలో
బానిసగా బ్రతుకుతూన్న
భరతమాత బంధనాల త్రెంచి
బ్రతుకులో స్వతంత్రపు జిల్లులు
వెదజల్లిన వీరులు ఎందరో!!
ఎందరో మహానుభావులు
అందరికీ వందనాలు.

పగ లనక రే యనక
పురుషు లనక స్త్రీ లనక
కులమనక మతమనక
నడుంకట్టి దీక్షబట్టి
స్వాతంత్ర్య సమరంలో
పూజ్య బాపూ బాటల్లో
సాగించారు స్వతంత్రతా యానాన్ని
మ్రోగించారు విజయభేరిలని.

ఆనందం విరిసింది
కన్నతల్లి కళ్ళల్లో
సంతోషం మెరిసింది.

త్రివర్ణపు జెండా
కుంకుమ రేఖవోలె
ఆకాశాన
గుతులు వేసింది.

కానీ,
మూణ్ణాళ్ళ ముచ్చటగా
మురుపైన తీరకుండ
కళ్ళుమూశాడు బాపూజీ
అమరుడైనాడు పితాజీ
ఉక్కుమనిషి సర్దార్ పటేల్
ముద్దుబిడ్డ జవహర్ లాల్
బుద్ధికుశలుడు లాల్ బహదూర్
భారతరథ సారథ్యాన్ని వహించారు
కన్నతల్లి కన్నీళ్ళను తుడవ ప్రయత్నించారు.

కానీ,
కాలచక్రాన్ని ఎవరు ఆపగలరు ?
త్రిమూర్తులు క్రమంగా
కలిసిపోయారు
కాలగర్భంలో.

అవతరించింది
అని భారాన్ని వహించ

భద్రకాళివోలె ఇందిరమ్మ
తండ్రితాతల విద్యాబుద్ధులు
పలు నేతల శక్తియుక్తులు
ఉగ్గుపాలతోనే రంగరించింది
ఒక్క గుటకలోనే జీర్ణించుకుంది.

"యింతికాదు ఈమె మనపాలిట యమకింకిణి"
అన్నాయి కొన్ని కంఠాలు
"ఆడదానికి రాజ్యాధికార మేమి" టన్నాయి
మరికొన్ని కంఠాలు.

అయితే,
పార్టీ పేరిట పొట్టలు పెంచే నాయకులు
ధర్మంపేరిట జేబులు నింపే లీడర్లు
ఇంకా ఎన్నో అఘాయిత్యాలు
ఎన్నెన్నో అన్యాయాలు
మరెన్నో దురంతాలు
నామరూపాల్లేకుండా
ఆదిలోనే త్రుంపివేసి
విజేత ననిపించుకుంది
మనపాలిటి అమ్మ, ఇందిరమ్మ.

సృష్టికర్త ఒక్కడే
మానవాళి ఒక్కటే
మాటతీరు వేరైనా
మతాలన్ని ఒక్కటే

అంతస్థులు వేరైనా
అందరమూ ఒక్కటే.

భేదాలు పోవాలి
రాగాలు కలవాలి
కన్నతల్లి నీడలో
కలసి మెలసి వుండాలి.

సరిగమల మధురిమలా
సమానత్వం రావాలి
"సోషలిజం" మన నైజం కావాలి
అదే నవభారత నిర్మాణం
భారతీయుల కల్యాణం.

ఏల ఈ ఆక్రందన ?

ఎందుకో ఈ ఆవేదన
ఏలనో ఈ ఆక్రందన
ఉన్నదానితో తృప్తి పడి
ఊరుకున్నాడు నాటి మానవుడు
లేనిదాని కోసం
తపన పడుతూ
పరుగులు తీస్తున్నాడు
నేటి మానవుడు.

అత్యాశా పూరితుడై
ఆవేశానికి బందీయై
అర్థానికి దాసుడై
నీతి నియమాలను
నిళ్ళతో కడిగేసుకుని
పరువు మర్యాదల
బరువులు గాలికొదిలేసి
ఏదో పొందాలని
ఇంకేదో కావాలని
ఊహా సౌధాల నిర్మించి
కోరికలు గుట్టాలై పరుగెత్తితే
ఆశలు కోటికి పడగెత్తుతే

తట్టుకోలేక కూలిపోతున్నాడు
మానవుడు నేల జారిపోతున్నాడు.

ఆశ అనేది జీవికి అవసరమెగాని
శ్రుతిమించితే ఏమౌతుంది ?
అత్యాశ అంతులేని దుఃఖకారణం
తెలుసుకోలేక అంధుడై
కామాంధుడై బలిఅవుతున్నాడు
మానవుడు మూడి మసి అవుతున్నాడు.

నాటి న్యాయం నశించింది
ధర్మం దాక్కుంది
త్యాగం తలవంచుకు కూర్చుంది
మరి ఏం జరిగింది ?
అన్యాయం అధికమయింది
అశ్లీలం పెరిగింది
స్వార్థం రొమ్ము విరుచుకు తిరుగుతోంది.

నీటికోసం దెబ్బలాట
కూటికోసం కుమ్ములాట
స్థలంకోసం కీచులాట
ఎందుకో ఈ ఆవేదన
ఏలనో ఈ ఆక్రందన.

ఏం కట్టుకు పోతారని
ఏం పట్టుకు పోతారని

నదీనాం సాగరో గతిః
చివరకు అందరూ చేరుకునేది
ఒకే ఒక్క చోటికి
ఇది నిజం ముమ్మాటికి.

కాలం కరిగి పోకముందె
సమయం మించిపోకముందే
మంచిని పెంచి
నలుగురికీ పంచి
హాయిగా జీవించు
శభాషనిపించు
అంతేగానీ,
ఎందుకీ ఆవేదన
ఏల ఈ ఆక్రందన.



మనిషిగా బ్రతకడం

మనిషీ ! మనిషిగా బ్రతకటం నేర్చుకో
దుర్గుణాల మలినాలను దూరంగా ఒదిలేసి
మంచిని పెంచు మార్గాలను
అనుసరించడం అలవరచుకో.

జీవితం ఒక గులాబీ
ఆహ్లాదాన్నిస్తుంది
గులాబీల సౌందర్యం
ఆనందాన్నిస్తుంది
జీవితపు సౌరభ్యం.

రెక్కలు రాలిపోతే
అందవికార మౌతుంది గులాబి
క్రమశిక్షణ లేకపోతే
అర్థవిహీన మౌతుంది జీవితం.

అందంగా కనిపించే గులాబీకి
ఎన్నో ముళ్ళా !!
తియ్యగా కనిపించే జీవితంవెనకాల
ఎన్నెన్నో చీకట్లు !!
ముళ్లు గుచ్చుకోకుండా గులాబీలు కోసుకోవాలి
చీకట్లు చిమ్మకుండా

జీవితాన్ని దిద్దుకోవాలి
అందుకు,
నేర్పూ ఓర్పూ కావాలి
మంచీ చెడూ తెలియాలి
అప్పుడే మనిషిగా మనగలుగుతావు.

మనిషిలోని కలుషితాన్ని
మంచితనంతో కడిగేసి
అద్దంలోని ప్రతిబింబంలా
నిన్ను నీవు చూచుకో
అప్పుడే మనిషిగా మనగలుగుతావు.

అహంకారపు పొరలు
కనుల కడ్డంగా నిలిచినప్పుడు
మెదడు నుపయోగించి
పొరల కరిగించి
కనుపాపల్లో దాగివున్న సత్యాన్ని చూడు
అప్పుడే మనిషిగా మనగలుగుతావు.

పదవీ వ్యామోహంలో
పలుకుబడి కాగిట్లో
నిన్ను నీవు మరిస్తే
కాలమనే చక్రంలో
అది ఋణికమని తెలుసుకో
నీదారి మలుపుకో
అప్పుడే మనిషిగా మనగలుగుతావు.

మనిషిగా పుట్టిన నీవు
మానవత్వాన్ని విడచే
దానవుడిలా, దారుణంగా
జీవించడంకన్న
హంసలా, ఆరునెల్లుచాలు మనిషీ !
మనిషిగా బ్రతకడం నేర్చుకో



ఇక భరించలేను

ఇదేనా నాదేశం
కాదనండి నాకోసం, బొనంకే,
ఈ ఘోరాలుచూసి ఇక భరించలేను
భరించినా ఆచోట మరి ఇంక బ్రతుకలేను.


ధాన్యలక్ష్మిని తనదొడ్లో కట్టేసి
అన్నపూర్ణగా అందలమెక్కిన ఆ తల్లి
కన్నబిడ్డకే పట్టెడు కూడు పెట్టలేక
కన్నీరు కారుస్తూవుంటే
బీదవారి హృదయాల పగుళ్ళలా
బీటలువారిన బంజరుభూములు
హృదయాన్ని బ్రద్దలు చేస్తూవుంటే
ఈ ఘోరాలుచూసి ఇక భరించలేను
భరించినా ఆచోట మరిఇంక బ్రతుకలేను.

కమ్మని పాలూ పెరుగూ అందించి
ముద్దుముద్దు తువ్వాయిల నడుమ
హాయిగా జీవించే గోమాతలు
బిచ్చగత్తె వొడిలో చిక్కశల్యమై
ఆడుకో యత్నిస్తూన్న చిట్టిపాపాయిలా
కుమిలించి క్షోభిస్తూవుంటే

ఈ ఘోరాలు చూసి ఇక భరించలేను
భరించినా ఆచోట మరిఇంక బ్రతుకలేను.

అన్నదమ్ముల అన్యోన్యానికి
ఆలవాలమైన ఈవనిలో
మానాలుతీసే దానవుల
ప్రాణాలు తీసిన
పుణ్యవతుల పుట్టింట్లో
అన్నదమ్ములు కత్తులునూరి
కుత్తుకలు కోసుకుంటూవుంటే
అభిమానాన్నొదిలి
ఆడపిల్లలు అమ్ముడు పోతూవుంటే
ఈ ఘోరాలుచూసి ఇక భరించలేను
భరించినా ఆచోట మరిఇంక బ్రతుకలేను.

ఇదేనా నాదేశం, దయచేసి
కాదనండి నాకోసం.



వెన్నెల రాత్రి

అది వెన్నెలరాత్రి
కన్నెల హృదయాలను కదిలించే
కమ్మని రాత్రి
వధూవరుల యెదల్లోన
వలపులు చిందించే
పసిడి వెన్నెల రాత్రి.

మగువల మనసుల్లో
మల్లెలు విరసించే
మధురమైన వెన్నెలరాత్రి.

పడుచుదనం
పరవళ్లు త్రొక్కే
యవ్వనుల కది
పండగ రాత్రి
తొలిపొద్దోని
చిట్టిపాపల్ని
జోలపాడి ఊరడించే
తల్లులకది
పాల వెన్నెల రాత్రి.

గతంలోని స్మృతులెన్నో
గళమెత్తి పాడుతూంటే
జారిపోయిన యవ్వనాన్ని
జాగృతం చేసే
వెండివెన్నెల రాత్రి.


చల్లని రాత్రి అది
వెన్నెల రాత్రి, కానీ
కట్నాల బరువుతో క్రుంగిపోతూన్న
కన్నవారి కష్టాలు చూడలేక
కన్నీరు కార్చే కన్నియ కది కాళరాత్రి.

ఆకాశాన్నంటే ధరలతో
చాలీచాలని జీతంతో
సాగుతూన్న జీవితాల కది
మహా శివరాత్రి.

పరిస్థితుల సంకెళ్ళలో చిక్కి
పవిత్రతను సయితం కాపాడుకోలేని
మానినుల కది, మచ్చతెచ్చే
మాయదారి రాత్రి.

పేదవాడి గుడిసెలో
పేలికల జోలెలో
నిదురించే పాపాయికి
వెలుగే చేరని కాటుకరాత్రి
తెలియరాని కలల రాత్రి.

కండరాల కరిగించి
కష్టాల కుంపట్లో కాలిపోతూన్న
జీవితాల కది
కసితో హసిస్తున్న కటిక అమావాస్య రాత్రి
అయినా,
అది వెన్నెల రాత్రి.



ముందలింపు

ఎంత సేపని ఎదురు చూతును
ఒంటరిగా నీ జంటకోసం
ఏమంటినని దాగుంటివి
ఏమంటినని రాకుంటివి.

అధికారంలో ఉన్నప్పుడు
అవకాశం లభించినప్పుడు
ఎంగిలి కంచాలు నాకినట్లు
లంచాలు మింగొద్దన్నాను.

ఆపదలో ఆడకూతురు
సహాయాన్నర్థిస్తే
ఆమె శీలాన్నే కాంక్షించే
కాముకుడవు కావద్దన్నాను.

పెద్దనునిషిగా చలామణవుతూ
వేరుమోసిన లీడరి నంటూ
ప్రజాసేవ పేరిట, ప్రజల ధనాన్నే
కొల్లైయ్యొద్దన్నాను.

నీతులుచెప్పే నీటుమనిషిగా
కొంపలుకూల్చే కోడెత్రాచుగా

బహురూపా లొద్దన్నాను
బడాయిలు మనకొద్దన్నాను.

అంతేకానీ,
మనిషిగా బ్రతకొద్దన్నానా ?
మనసిస్తే నే లేనన్నానా ?

ఏమంటినని దాగుంటివి
ఏమంటినని రాకుంటివి
ఎంతసేపని ఎదురుచూతును
ఒంటరిగా నీ జంటకోసం.



శేషప్రశ్న

ఎందుకు పుట్టించావు భగవాన్
గొప్పా బీదా కుంటీ గుడ్డి అంటూ
ఎందుకు సృష్టించావు భగవాన్
మనిషికీ మనిషికీ మధ్య ఇంత తారతమ్యాన్ని.

కడుపునిండా కూడులేక
తలదాచగ గూడులేక
కట్టుకుందుకు బట్టలేక
సంఘంలో తావులేక
చావలేక బ్రతకలేక
నలిగిపోయీ విసిగిపోయీ
కొందరుంచే,
తిన్న దరిగించుకోలేక
మందుగోలీలు మింగలేక
ఉన్న డబ్బుతో తృప్తిపడక
ఏంచెయ్యాలో దిక్కుతోచక
ఎవడిబుఱ ఎలాకొట్టాలో
ఎలక్షన్లలో నుంచోవాలో
మంత్రిపదవి ఎలాపొందాలో
తెలియక గిజగిజలాడే
మరికొందరు

ఎందుకు సృష్టించావు భగవాన్
మనిషికీ మనిషికీ మధ్య ఇంత తారతమ్యాన్ని.


ఆశయాలపై ఆశలు పెట్టుకున్న వ్యక్తికి
కలిపించావు లేమి అనే పెద్ద అగాధాన్ని.

అజ్ఞానంలో కొట్టుకులాడుతూన్న
కొందరికి కలిగించావు సకలసౌభాగ్యాలని
అంతేనా,
అంధులనీ
అంగ విహీనులనీ
రోగులనీ
బాధాపూరితులనీ
పదో ఒక పేరిట
కట్టావు అడ్డుగోడల్ని
నిలిపావు, నిరాశా
నిస్పృహా అనే పైశాచిక శక్తుల్ని.

ఎందుకు నీకీ పటుపాశం
ఏమిటి ఈ విచిత్ర విలాసం
అస లెందుకు సృష్టించా వీ మానవాళిని ?

నీ చదరంగపు టాటలో
పావులుగా వాడుకోవటానికేనా
నీ విలాస కేళిలో
ఈ వింతలుచూసి, మురిసిపోవటానికేనా ?

ఎందుకు పుట్టించావు భగవాన్
గొప్పా బీదా కుంటీ గ్రుడ్డి అంటూ
ఎందుకు సృష్టించావు భగవాన్
మనిషికీ మనిషికీ మధ్య ఇంత తారతమ్యాన్ని.



స్నేహమా విడిపోకు నన్ను

స్నేహమా విడిపోకు నన్ను
నీవు లేకుంటే లేనేలేను నేను.

మనిషికీ మనీషికీ మధ్య
మమతలకు ఆలంబనం నీవు
ప్రేమకు మూలం నీవు
సృష్టికి కారణం నీవు
నీవు లేకుంటే జగతియే లేదు
నీవులేకుంటే లేనేలేను నేను.

గొప్ప బీదల తారతమ్యం లేదునీకు
అంతస్థుల ప్రమేయం అసలే లేదు
అందుకు నిదర్శనం
కుచేలోపాఖ్యానం.

అదొక్కటేనా !
స్నేహంకోసం ప్రాణాలొడ్డిన
కథలెన్నో !
ఆ గాధలెన్నో !!
స్నేహమా ! నీవు త్యాగశీలివి
దయామయివి కరుణాప్రపూర్ణవి.

స్వార్థపు వలయాలు సుళ్లు తిరుగుతూన్న
ఈ రోజుల్లో
మంచికి స్థానం లేని ఈ లోకంలో
నీకు విలువ నివ్వలేరు, ప్రజలు
నిన్ను గౌరవించ లేరు.

నాకు తెలుసు నీ గుణం
మరువలేను ఒక్క క్షణం.

నీ పేరిట జరుగుతూన్న ఘోరాలు
నా ప్రాణాలు తీస్తూన్న ఆయుధాలు.

నీ నీడన జరిగే అక్రమాలు
యమలోకానికి సోపానాలు.

అన్యాయం పెరిగి పోతూన్న ఈ నాడు
అధర్మం రెచ్చిపోతూన్న ఈ రోజు,
తావులేక నిలువ లేక
నలిగావు నీవు
మిగి లాను నేను.

అయినా నా మాట నమ్ము
ఇది అక్షరాలా నిజము.

నీవు లేకుంటే లేనేలేను నేను
ఓ స్నేహమా! విడి పోకు నన్ను.

ఇరువుర మొకటై నడవాలి

నీలో ముసిరిన చీకట్లు
నా నవ్వుల వెలుగుల పోవాలి
నీలో నిండిన ఇక్కట్లు
నా చెలిమికి బలియై పోవాలి
కలతలు కలలై కరగాలి
మమతలు నిజమై నిలవాలి
ఇరువుర మొకటై నడవాలి
యువతరాన్ని మేల్కొల్పాలి.


నీలో ముసిరిన చీకట్లు
నా నవ్వుల వెలుగుల పోవాలి.

స్వార్థం మనలో పోవాలి
త్యాగమె ధ్యేయం కావాలి
ఈర్ష్యా అసూయల శరమాలి
అభ్యుదయాన్నే కోరాలి.

అవి నీతిని అంతం చేయాలి
నీతికి నిలబడి పోవాలి
నీలో ముసిరిన చీకట్లు
నా నవ్వుల వెలుగుల పోవాలి.

ఐకమత్యమును పెంచాలి
ప్రేమే సర్వం కావాలి
మనసే మందిర మవ్వాలి
మనిషినే అందులో కలవాలి
మానవ సేవే మాధవసేవని
ఊరంతా చాటించాలి
నీలో ముసిరిన చీకట్లు
నా నవ్వుల వెలుగుల పోవాలి.

నీవూ నేనూ రెండు కళ్ళలా
నవ సమాజ నిర్మాణం కోసం
యువతరానికి భవితవ్యం కోసం
మార్గ దర్శకులం కావాలి
చైతన్యం చిగురించాలి
నీలో ముసిరిన చీకట్లు
నా నవ్వుల వెలుగుల పోవాలి.



ఎవరు నేర్పారు నీకు

లోకానికి వెలుగు నిచ్చే ఓదివ్వే
వేడిమిలో కాలి పోదువా నువ్వే
నీవు లేకుంటే జగమంతా చీకట్లు నిండు
నీవు లేకుంటే జరిగే ఘోరాలు మెండు
నీ చాటున జరుగును దోపిడీలు దొంగతనాలు
నీ మరుగున జరుగును శీలాప హరణాలు.

నీ వుంటే వాటికి తావులేదు
నీ ముందు నిలిచేశక్తి వాటికి లేదు.
నీ వెలుగుతో చూపుతావు నుంచి మార్గాన్ని
నీవు కాలిపోతూ ప్రసరిస్తావు మాకు కాంతి కిరణాల్ని,
ఎవరు నేర్పారీ త్యాగబుద్ధి నీకు
ఎవరు నేర్పారీ సమతా స్వభావం నీకు
నీ వేడిమితో మాలోకరుడు గట్టిన
స్వార్థాన్ని కరిగించు
నీ ఓరిమితో మాలో దాగివున్న
దుర్గుణాల తొలగించు.

నీలోని మంచిని అందరికీ పంచిపెట్టు
మా హృదయాల్లో సదా నీగుణం నిలబెట్టు
లోకానికి వెలుగు నిచ్చే ఓ దివ్వే
వేడిమిలో కాలిపోదువా నువ్వే. **

నీ మొహం చూసేదెవరు?

ఊరంతా తిరిగినట్టున్నాడు
ఉస్సురంటూ కూర్చున్నాడు
అరిగి పోయిన చెప్పులు
కరిగి పోయిన కలల్లా
జరిగి పోయిన కాలాన్ని
గుర్తు చేస్తున్నాయి.

వాడిపోయిన కమలంలో
తేనె కోసం వెదుకుతూన్న
భ్రమరాల్లా
ముంగురులు ముఖంమీద పడుతున్నాయి
గుండెలోని బరువు మరీ
హెచ్చిపోతోందేమో
షర్టు గుండీ లూడదీసి
అరచేతులతో గుండె నదిమిపట్టుకున్నాడు.

కడుపులోని ద్రోగులు
కర్రుమని చప్పుడు చేస్తూవుంటే
కన్నీళ్లు తుడుచుకుంటూ
కొళాయి దగ్గిరికెళ్లి
చన్నీళ్లతో కడుపు నింపుకున్నాడు

విరహ వేదనేమో అనుకుంటే, ఆ
తరవాగా అనిపించలేదు.

భగ్నప్రేమికుడనుకుంటే ఆ
పోజులో కనిపించలేదు
కొంపదీసి కవి కాదుకదా అనుకుంటే
గీకి పారేసిన కాగితాలూ
దులిపిన సిరా చుక్కల మరకలూ
మచ్చుకైనా లేవక్కడ
మరెవరై వుంటారు చెప్మా?


ఒక్కొక్క కాగితం
ఒకసారికి, మరోసారి
తిరగేసి చూస్తున్నాడు
పేపర్లలోని "వాంటెడ్ కాలమ్" లతో
సరిపోల్చి చూస్తున్నాడు.

ఏమిటా ఛాదస్తం?
పట్టాల కాగితాలు
వికటాట్టహాసం చేస్తున్నాయి.

వెఱ్ఱివాడా! ఇంకా వెనకటి రోజుల్లోనే వున్నావా?
ఎవరిక్కావాలి ఈ పట్టాల దస్తరాలు
ఎవరికుంది తీరిక
వీటిని చూసే ఓపిక
చాతనయితే
తెచ్చుకో సిఫారస్సుల కాగితాలు

ఇచ్చుకో (వి) నాయకులకు మామూళ్లు
అంతేకానీ,
ముక్కు సూటిగా వెడతానంటే, నీ
మొహం చూసే దెవరు ?
నీ రోదన వినేదెవరు ?

పిచ్చివాడా !
అంత పని చెయ్యలేనంటావా, దీని
అంతం చూస్తానంటావా ?
నువ్వు చెప్పింది నిజమేలే, కానీ
నీ ఒక్కడివల్లా అవుతుందా ఈ పని ?



ఆమె కేం తెలుసు?

తెల్లవారు తోందనగానే
కళ్లు గట్టిగా మూసుకుని
దుప్పటి మరింత బిగించి
కప్పుకు పడుకున్నాడు
ప్రక్క వాటాలో అద్దెకున్న
పెద్దమనిషి,
ముగ్గురు బిడ్డల తండ్రి.

కళ్లు తెరవకుండానే
కాఫీ పొడుం లేదండీ అంటూ
మేలుకొలుపు పాడుతుంది
జాలి గొంతుతో శ్రీమతి
"పండగనాడన్నా కాస్త
పెందలాడే రాకూడదూ ఈ
పాలవాడు," అని విసుక్కుంటూ
పనిమనిషి రానన్న విషయం
అప్పుడే గుర్తుకొచ్చి కసుక్కుంటూ
పాచిపని పూర్తి చెయ్యటంలో
మునిగిపోతుంది ధర్మపత్ని.

"అమ్మా నా కొత్తబత్తలే" అంటూ
ఖాబిగాడు కొంగుపట్టి లాగుతాడు.

"అబ్బ ఉండరా,
ఎందుకా తొందరా.

నాన్నగారు లేచాక
అన్ని డబ్బులూ ఇచ్చి
బాకీ తీర్చేసితెచ్చుకుందాం"
అన్న ఇల్లాలి మాటలు
ముసుగులో నిద్రపోతున్నా ననుకున్న
నాన్న గుండెల్లో సముద్రాలు సుళ్లు
తిరుగుతున్నాయని
పాపం! ఆ ఇల్లాలి కేంతెలుసు?

"పది రూపాయల చీరైనా
కొనలేరా" అంటుందని
ఫెస్టివల్ అడ్వాన్సు పెడితే
ఆ పండక్కి అకౌంటెంటు
పది రోజులు శెలవు పెట్టాడని
బిల్లు పంపలేదని
ఆమె కేంతెలుసు?

పండగపూటైనా వొట్టి
పప్పన్నమేనా తింటారని
పది మందిని అప్పు అడగాల్సి
వస్తుందని
ఆమె కేంతెలుసు?

పండగలంటే
మధ్య తరగతి

కుటుంబీకుడికి
ప్రాణాలు తోడే
దండగ రోజులని
ఆమె కేం తెలుసు?

అంతకంటే, పస్తులున్నా
ఉత్త రోజులె నయం అనిపిస్తుంది
పాపం! పండగనాడు పడే
పక్కంటాయన బాధలు
ఎవరికి తెలుస్తాయి
దుప్పటిలో రోదించే
అతని హృదయానికి తప్ప.



కాల సముద్రం

కాలం ఒక సముద్రం
జీవు లందులో నౌకలు
గాలి జోరు ఎక్కువై తే
హోరు మంటుంది సముద్రం
మదిలో పోటు మొదలై తే
బావురు మంటుంది జీవితం.


కరిగి పోయిన కలల్లా
చెదిరి పోతాయి అలలు
తొలగి పోయిన కష్టాల వెనుక
మిగిలి పోతాయి కథలు.

అజ్ఞానం అమావాస్య
తెలివి కాంతి నిచ్చే చంద్రరేఖ
చీకటి సంకెళ్ళనుండి
బయట పడి
వెలుగు రేఖల్ని చూడటం
తెలివి మంతుల లక్షణం.

సముద్రం ఉధృతంగా ఉన్నప్పుడే
కలుగుతుంది భయం
కష్టాలు కాపుర మున్నప్పుడే

బయట వడుతుంది
మానవుని నైజం
కాలం ఒక సముద్రం
జీవు లందులో నౌకలు.

అలలు కడిగిన ఆల్‌చిప్పలే
ఆణి ముత్యాలు
కాలం కాచిన కషాయాలే
అనుభవాల మూలికలు
అనుభూతుల ఆలింగనలే
జీవితపు బాటలు
కాలం ఒక సముద్రం
జీవు లందులో నౌకలు.



నీదే ఈ భవిష్యత్తు

బోసి నవ్వుల చిట్టి పాపా
ఊసులన్నీ చెప్పుతావా
ఊరడిస్తే ఊ కొడతావా.

ఎందుకో ఆ బోసి నవ్వులు
మురిపాల తేలే పాలవెల్లులు
ఇంట పూచిన విరజాజులు
వింత కాంతుల కొత్త జ్యోతులు.

కల్తీ నవ్వుల మమ్మ చూస్తే
పకాపకా నవ్వాలని వుందా
కల్మషాల మా జీవితాల చూసి
కడుపులో దేవుతున్నట్టుందా ?

అందుకేనా
ఏడుస్తూ నవ్వుతావు
నవ్వుతూనే ఏడుస్తావు
బోసి నవ్వుల చిట్టి పాపా
ఊసులన్నీ చెప్పుతావా
ఊరడిస్తే ఊ కొడతావా.

మతాల పేరిట జరిగే
మారణ హోమాలు


ధర్మం పేరిట జరిగే
దారుణ కాండలు
వింతగా వుందా ?
నీకంతా కొత్తగా వుందా ?

అందుకేనా
అలా తెల్లబోయి చూస్తావు
చూస్తూనే ఆశ్చర్య పోతావు
బోసి నవ్వుల చిట్టి పాపా
ఊసులన్నీ చెప్పుతావా
ఊరడిస్తే ఊఁ కొడతావా.

మల్లెపువ్వు నీ మనస్సు
అద్దం నీ హృదయం
నీకర్థం కాదు పాపా
ఈ కసాయి కృత్యాలు
ఈ హత్యాకాండలు
ఎందుకలా ఉలిక్కి పడతావు ?

పెరుగుతూంటే తెలుస్తుందిలే నీకు
బెదిరిపోతే ఏ లాభం
బాధ పడితే ఏం లాభం
పెరిగే నీ బుద్ధితో
ఈ బుద్ధులు కలవకుండా చూచుకో
దరికి చేరకుండా కాచుకో.

నేడు పాపవి
రేపు పౌరుడువి
నీదే ఈ భవిష్యత్తు
నీవే మా కలల నొత్తు
బోసి నవ్వుల చిట్టి పాపా
ఊసులన్నీ చెప్పుతావా
ఊరడిస్తే ఊఁ కొడతావా.



అందుకే నే ప్రాకులాడుతున్నది

ఓ మనసా
నీవు మెలకువగా వుంటేనే
నాకు మెవ్వులు
నీవు పొరబడితే
తప్పవు ముప్పులు.

నీవు తిన్నగా నడిస్తే
నేను మిన్నగా హిమాలయ శిఖరాన్నే
అధిష్ఠించ గలను
నీవు వక్రిస్తే
అధః పాతాళానికి
అణగారి పోతాను.

నీవు పలికిస్తే
సభాసదుల నడుమ
అఖండ గౌరవాలను
అందుకో గలగుతాను
నీవు కోపిస్తే
నలుగురిలో
నవ్వులపాలై పోతాను.

నీ చల్లదనంతో
నా వన్నెలకు మరికొంచెం మెరుగులు దిద్ది
నా సంస్కృతికి రంగులు పూయగలవు.

నా పద లాలిత్యాన్ని
గానసుధా రసామృతాన్ని
పరిమళాల గుబాళించి
పూల బాటలో నడిపించ గలవు.


నీ తొందర పాటుతో
నోరు జారితే
నా నాగరికతను
మంట గలిపి
నన్ను నాశనం చెయ్యగలవు
ముళ్ళబాటనే సృష్టించగలవు.

ఓ మనసా
రుచులతో పాటు
అభిరుచులు తెలిసిన నీకు
మెలకువలు నేర్పడం
తాతకు దగ్గులు నేర్పడం.

అయినా
సుభాషితాలే తప్ప
దుర్భాషకు లోబడకుండా
కాపాడే బాధ్యత

నీమీదున్నది. అందుకే
నే ప్రాకులాడుతున్నది.

ఓ మనసా
నీవు మెలకువగా వుంటేనే
నాకు మెప్పులు
నీవు పొరబడితే
తప్పవు ముప్పులు.



ప్రేమంటే తెలుసుకో

ప్రేమ అనే పదాన్ని
పదేపదే వాడే ముందు
ప్రేమంటే తెలుసుకో
ప్రేమించడం నేర్చుకో.

మాటరాని మూగజీవుల నడుమ
భాషలేకున్నా, భావయుక్తంగా
బాధ్యతాయుతంగా
నడిచే జీవనం ప్రేమ.

కల్లాకపట మెరుగని
చిట్టిపాపల మమతానుబంధాలే
మరపురాని కమనీయమైన ప్రేమ.

కడుపుతీపితో
కన్నబిడ్డల రక్షణకోసం
కారుచిచ్చును సయితం
కడుపులో దాచుకుని
కన్నతల్లి త్యాగగుణమే
మరపురాని మాతృప్రేమ.

కనిపించని దేవుడిపేరిట
నైవేద్యాలర్పించడంకన్న

కడుపు మంటతో
కూటికోసం ప్రాకులాడే పసివానికి
పట్టెడన్నం పెట్టడం మిన్న
ఈ సున్నితమైన సహజీవనమే
స్వచ్ఛమైన మానవప్రేమ.

తెలియక తప్పుచేసిన మానవుడు
తెలిసి పశ్చాత్తాప పడుతూన్నప్పుడు
ఓరిమితో మన్నించి
చేరదీసి
ఊరడించడమే
జగతిమెచ్చు విశ్వప్రేమ.

ప్రేమే త్యాగం
త్యాగమె దైవం
ప్రేమ అనే పదాన్ని
పదే పదే వాడేముందు
ప్రేమంటే తెలుసుకో
ప్రేమించడం నేర్చుకో.

★

నిజమేలే పాపా నువ్వు చెప్పింది

ముద్దులొలికే
చిట్టిపాపా
ఉట్టిగా
అలా కూర్చున్నా వేం ?

ఊరంతా రంగు రంగుల దీపాల
ఉయ్యాలలో ఊగిపోతూవుంది
వింతకాంతుల మెరిసిపోతూవుంది.

రంగు రంగుల దీపాల తోరణాలు
కొత్త కిరణాలను ప్రసరిస్తున్నాయి
కోటి సూర్యుల వెలుగుల్ని
కలిగిస్తున్నాయి
ఇది దీపావళి.

మానవాళిని ఉల్లూతలూగించి
వింతవింత దివ్యశోభలతో
మైమరపించే
దీపావళి.

అయినా
ముద్దులొలికే

చిట్టిపాపా
ఉట్టిగా
అలా కూర్చున్నావేం ?

నీ హృదయం చికటితో నిండిపోయిందెందుకు ?
నీ మనస్సు శోకంతో క్రుంగిపోయిందెందుకు ?
ఈ వెలుగులు నీకనులను తాకలేదా ?
ఈ రంగులు నీ మనస్సుకు పట్టలేదా ?

పాపాయీ,
పులకించే నీ హృదయం
పలకటం లేదెందుకు ?
మాటలాడే నీ మనస్సు
మూగబోయిన దెందుకు ?

ఓ ...
అర్థంమయిందిలే పాపా నీ
ఆంతర్యం.
వ్యర్థంకాదులే పాపా నీ
ఆదర్శం.

ఊరంతా నక్షత్రాల హారంలా
అలంకరించుకుని
ఆనందిస్తూవుంటే
ఉట్టిగా
అలా ఎందుకూర్చున్నావో
అర్థమయిందిలే చిట్టిపాపా.

నిత్యం పస్తులతో గడిపే
నిరుపేద గుండెల్లో
మండుతూన్న వెలుగులు చూడలేని
మానవాళి
మతాబుల్లోంచి,
కాకర పువ్వొత్తుల్లోంచి జారే వెలుగులు చూసి
మురిసిపోతూవుంటే
నువ్వూ నవ్వలేకపోతున్నావు
నలుగురిలో తిరగలేక పోతున్నావు.

అంతేనా,
ఒక్క నరకాసురుని చంపినందుకే
ఇన్ని దీపాల వెలుగైతే
నేడు దేశాన్నే మింగుతూన్న
బకాసురులు పోతే
ఎన్ని దీపాలు వెలగాలి!!
ఎన్ని జ్యోతులు నిలవాలి!!
అదేలే పాపా నేనంటూన్నది
నిజమేలే నువ్వనుకుంటూన్నది.

జీవితం నావ

జీవితం ఒక నావ
జీవి ఒక ప్రయాణీకుడు.

తెరచాప ఆధారంగా
ఎన్ని ఒడుదుడుకులనైనా తప్పించుకుని
ఒడ్డు చేరుకుంటుంది నావ
అంతరాత్మ ఆదేశంతో
ఎన్ని కష్టాలనైనా కళ్లుమూసుకు భరించి
తరింప యత్నిస్తాడు జీవి.

గాలిదుమారాలకు తల్లక్రిందులైనా
సముద్రం సుళ్లుతిరుగుతూ ఎదురీదినా
నావికుడి తెలివితో
తీరాన్ని చేరుతుంది నావ
వేదరికం తనని చూసి వెక్కిరించినా
పెక్కు ఇక్కట్లకు లోనైనా
విధియె ఎదురుతిరిగి కత్తిదూసినా
ధీరోదాత్త మేధావంతులు
జయిస్తారు జీవిత సమరాన్ని
గ్రహిస్తారు జీవన రహస్యాన్ని.

కష్టాలే లేకపోతే
సుఖానికి విలువేది ?

పేదరికమే లేకపోతే
సంపదలకు స్థానమేది ?
చీకటే లేకపోతే
వెలుతురికి ప్రత్యేకత ఏది ?
చావే లేకపోతే
బ్రతుకులో బంధమేది ?
చెడు వుంటేనే మంచికి విలువ పెరుగుతుంది
కష్టాలలో తేలితేనే మనిషికి స్థానం తెలుస్తుంది.

పయనించే నావకి
ఎన్నో చిక్కులు
సాగిపోయే జీవికి
ఎన్నో చీకట్లు గుర్తులు.

తెలివితో నడిపితే
ఒడ్డు చేరుతుంది నావ.

మేధావిగా బ్రతుకుతే
గట్టెక్కుతుంది జీవితం.

జీవితం ఒక నావ
జీవి ఒక ప్రయాణీకుడు.

మనిషి మనీషిగా బ్రతకలేకపోతున్నాడు

ఎంత ఉక్కు అయినా
నిప్పలో కరిగించితే
నీరులా కరుగుతుంది.

ఎంత రాతి బండైనా
సుత్తితో బాదితే
సుందరమైన శిల్పంగా మారుతుంది.

ఎంత ఉద్ధతమైనదైనా సాగరం
మానవుడి తెలివితేటలకు కట్టుబడి
ఆనకట్టలకు ఆగుతుంది.

ఎంతటి భయంకర క్రూరమృగాలనైనా
మానవుడు మచ్చికతో చేరదీసి
చతురతతో స్వాధీనం చేసుకుంటున్నాడు
ఓరిమితో లొంగదీస్తున్నాడు.

నేడు మానవుడు సాధించలేనిది లేదంటూ
విజృంభిస్తున్నాడు.

కానీ,
మనిషిలో కరుడుగట్టిన
మూర్ఖత్వాన్ని కరిగించలేకపోతున్నాడు.

మారే కాలంతో
మారుతూన్న విలువలతో
మారలేక
జీవితంతో కుస్తీపడుతూన్న
కూపస్థమండూకాలను
మార్చలేకపోతున్నాడు.

అధికులమనుకుంటూ
అంతరిక్షంవైపే చూపులుసారిస్తూ
నైతిక విలువల
నశ్టేటముంచి
అధోగతి పాలవుతూన్న
ఆత్మవంచకులను
అరికట్టలేకున్నాడు
ఆచారాల పేరిట
అమాయకుల జీవితాలను బలిచేసే
అజ్ఞానుల నాపలేకున్నాడు.

ఎన్ని సాధిస్తే ఏముంది ?
రచ్చగెలిచి ఇంట గెలవలేకున్నాడు
మనిషి మనిషితో ఓడిపోతున్నాడు
మనిషి మనీషిగా బ్రతకలేకున్నాడు.

నాకంటే బాగా తెలుసా నీకు ?

నీతులు చెబుతున్నావా మనిషీ ! నాకు
నాకంటే బాగా తెలుసా నీకు ?
ఆకలేస్తే నిసిగి పారేసిన
ఎంగిలాకులు నాకి
కడుపు నింపుకుంటాను కానీ
అన్యాయంగా పొట్టలకొట్టి
పొట్టబోసుకునే
పాడుపనులు చెయ్యను.

ప్రేమతో పాలుపోసి
చేరదీసిన వానికి
ప్రాణంపోయినా
విశ్వాసంతో సేవచేస్తాను కానీ
స్వార్థంకోసం
కసాయివాడిలా
పచ్చినెత్తురు త్రాగే
పరమ కిరాతకుణ్ణి కాలేను.

నీతులు చెబుతున్నావా మనిషీ ! నాకు
నాకంటే బాగా తెలుసా నీకు ?
నాటికీ నేటికీ ఒకేవిధంగా
ప్రపంచమంతా మారినా

ఇసుమంతైన మారకుండా
మా జాతిని నిలబెట్టుకున్నాము
మా గౌరవం కాపాడుకున్నాము.

అడుగడుగునా రంగులుమార్చే నీవు
నాగరికత పేరిట
నీ దేశసభ్యతను మంటగలిపి
పర సంప్రదాయాలతో
ఐకమత్యాన్ని వీడి
ఆత్మవంచన చేసుకుంటూన్న నీవు
నీతులు చెబుతున్నావా మనిషీ ! నాకు
నాకంటే బాగా తెలుసా నీకు ?
ఒక్క కుక్క మొరిగితే,
పది కుక్కలూ మొరుగుతాయి
ఒక్క కుక్కని కొడితే
పది కుక్కలూ మీదపడి
రక్కుతాయి.

పది మీలో ఈ సహజీవనం ?
పది మీలో ఈ ఐకమత్యం ?
పేరుతెచ్చే మచ్చలేని జీవితాలు మావి.
కుళ్లుదాచే మేడిపండు జీవితాలు మీవి.
ఇప్పుడు చెప్పు —
నీతులు చెప్పే మనిషీ !
నాకంటే బాగా తెలుసా నీకు ?

—※—

సృష్టిలో రహస్యం

ఏమిటో ఈ విచిత్రం
సృష్టిలో ఈ రహస్యం
ఒక్కతల్లి పిల్లలే అయినా
భిన్న భిన్న మనస్తత్వం
ఒక్కచోటే కలిసి పెరిగినా
వేరు వేరు స్వభావం.

కన్నతల్లి పాలుత్రాగి
కమ్మగా అమ్మవొడిలో
కేరింతాలాడే చిట్టిపాప
కన్యాదానం కాగానే
ఒక అయ్యచేతిలో పడగానే
కన్నవారినే పరాయివారిలా
'మీరూ' 'మీ ఇల్లూ' అంటుంది
మేమూ మా యిల్లూ వేరన్నట్టు.

ఏమిటో ఈ విచిత్రం
సృష్టిలో ఈ రహస్యం.

అతడే తన ప్రాణమని
పతియె తన సర్వమని
అతని సేవలోనే మునిగిపోతుంది
అతనికోసమే జీవిస్తుంది మగువ

పసుపు కుంకుమలకోసం
ప్రాకులాడే ముత్తైదువ.

కానీ
మాతృత్వం పొందగానే
పాపే నా ప్రాణమంటుంది
పతికి రెండో స్థానమిస్తుంది.

ఏమిటో ఈ విచిత్రం
సృష్టిలో ఈ రహస్యం.

తను తిన్నా తినకున్నా
బిడ్డలకు పెట్టి
పరమానందం పొందుతుంది తల్లి
తనకున్నా లేకున్నా తనయుల
తనకన్నా అధికుడిగా సేయనెంచి
కంటిపాపలా
కాపాడుతాడు తండ్రి.

కొడుకులు పెరిగి
కోడళ్లు రాగానే, అంతా
కోల్పోయినదానిలా
కోడలు తనని పూర్తిగా
దోచేసినట్టుగా
బాధపడుతుంది తల్లి
బాధ పెడుతుంది కూడా.

తనయుడు తనకంటే
అధికుడయ్యాడంటే

తననేదో చులకన
చేస్తున్నాడని తలంచి
పదే పదే తన అనుభవాలు
వల్లెవేసి
వాపోతాడు తండ్రి
విసిగించి రెచ్చగొడతాడు.

ఏమిటో ఈ విచిత్రం
సృష్టిలో ఈ రహస్యం.



జ్ఞాపకం

భవిష్యత్తు అనే
భవనానికి
వర్తమానం
కొన్ని మెట్లు
గతం పునాది రాళ్లు..

గతం గట్టి అనుభవాల మాలికలైతే
వర్తమానం వాటిలో
పరిమళించే పుష్పాలౌతాయి.


భవిష్యత్తు
దివ్యంగా వెలిగిపోయి
స్థిరంగా నిలిచిపోయే
తారక లౌతాయి.

రేపు మనం ఏమౌతామో
తెలుసుకునే ముందు
నిన్న మనం ఎలా వుండాలో
తలచుకుంటే చాలు.

జ్ఞాపకాలు జీవితానికి
వెలుగుచూపే దీపాలు కావాలి కాని
జీవితాలను కాల్చివేసే
నిప్పుకణికలు కాకూడదు.

మనిషిలోని మంచిని పెంచు
మార్గదర్శికావాలి కానీ జ్ఞాపకం
మనస్సును చంపే 'మాత్ర'
మాత్రం కాకూడదు.

చిరస్థాయిగా నిలిచిపోయే
చిహ్నం కావాలి జ్ఞాపకం
భవిష్యత్తులో
బంగారం పండించే
బీజం కావాలి జ్ఞాపకం.



విజయ దశమి

విజయాలెన్నో పొందావని
విఱ్ఱవీగుతున్నావు
ఫలితాల పట్టిక తయారుచేసి
విజయ దశమి జరుపుకుంటున్నావు.

ఏవయ్యా నీవు సాధించిన విజయాలు ?
ఎన్నయ్యా నీ కృషికి తగిన ఫలితాలు ?
అంతరిక్షంవైపు ప్రయాణం సాగించినా
అజ్ఞానాన్ని తొలగించలేకపోతున్నావు.

బ్రహ్మాండమైన జలపాతానికి
బ్రిడ్జిలు నిర్మించినా
బీదవాడి హృదయం పగిలి
కారుతూన్న కన్నీటిని
తుడవలేకపోతున్నావు.

నాగరికత పేరిట
నలుగురిలో నిగ్గువిడచి ప్రవర్తించి
పతనమౌతూన్న పతితల
కాపాడలేకపోతున్నావు.

దొరవేషంలో దారుణంగా
దోపిడీలు చేసే
ద్రోహుల నరికట్టలేకపోతున్నావు.

మరేమిటయ్యా నీవు సాధించిన విజయాలు
ఎన్నయ్యా నీ కృషికితగిన ఫలితాలు.
దుష్ట శక్తుల్ని సంహరించి
శిష్ట రక్షణ గావించి
ధర్మాన్ని నెలకొల్పుటయే
విజయదశమియొక్క ప్రత్యేకత
నాటి విశిష్టత.

ఊరికే జాబితాలు తయారుచేసి
మురిసిపోతే ఏంలాభం ?
ఊకదంపుడు మాటలతో
ఊరడిస్తే ఏంలాభం ?

కళ్లు తెరచి
వొళ్ళుమరచి
కష్టిస్తేనే ప్రతిఫలం
మతాల పేరిట
ద్వేషాలు విడచి
కలిసుంటేనే
కలుగు సుఖం.

వెదజల్లాలి దశదిశలా
ఐకమత్యపు బీజం
ప్రేమించాలి అన్నిదిశలా
దేశాభ్యుదయ గీతం
అదే నిజమైన దశమి
మరపురాని విజయ దశమి.

కుడి ఎడమలు

కుడి ఎడమ లెలాగో
బంధు మిత్రు లలాగు.

మనిషికి కుడి ఎడమలు రెండూ ప్రధానమే,
జీవితంలో బంధుమిత్రులిరువూరూ ముఖ్యులే.

కానీ,
ప్రతి శుభకార్యంలోనూ
కుడికే వుంది విశిష్టత
ఎడమకిలేదు
ఎట్టి ప్రత్యేకత.

ఎట్టి ఆపదలోనైనా
ఆదుకునేది మిత్రుడు
రాబందుల్లా
దెప్పిపొడిచేది బంధువు.

నిబంధనలులేని
నిష్కల్మషమైన
అనుబంధమే మిత్రత్వం.

బంధాల సంకెళ్లతో
బందీనిచేసి
బాధించేదే బంధుత్వం.

ప్రతిఫలం కోరడు మిత్రుడు
మనింటికొచ్చినా
వాళ్ళింటికెళ్ళినా
ఫలానే్న లెక్కవేస్తాడు బంధువు.

బాగుంటే సంతోషిస్తాడు మిత్రుడు
బాగు చూడలేక దుఃఖిస్తాడు బంధువు.

వినలేదా
కౌరవ పాండవుల బంధుత్వ చరిత్ర
సాఖ్యం కాదా
కృష్ణ కుచేలుర అపురూప మైత్రి.

కానీ,
రోజులో చీకటికన్న
వెలుతురే ఎక్కువ ఉపయోగమున్నా
రోజులో రేయింపవళ్లు రెండూ అవసరమే
మనిషికి కుడి ఎడమలు రెండూ ప్రధానమే
జీవితంలో బంధుమిత్రు లిరువురూ ముఖ్యులే.

మనిషి ఎదగాలి

మనిషి ఎదగాలి
మరెంతో పెరగాలి.

ఎంతో ఎత్తుగా
హిమాలయాన్నంచేట్టుగా
ఎంతో విశాలంగా.
మబ్బీచెట్టును మించేట్టుగా
మనిషి ఎదగాలి
మరెంతో పెరగాలి.

మానవతకు నీళుపోసి పెంచి
మమతలకు పందిరేసి ఉంచి
న్యాయానికి నిచ్చెనలు కట్టి
సమాజాన్ని ఉద్ధరించాలి,
సమానత్వాన్ని సాధించాలి,
సంతోషాన్ని స్థాపించాలి.

ఓరిమితో కూరిమిని చేకూర్చి
సంఘంలో పాతుకుపోయిన
పాతవాసనల కుళ్లును పారద్రోలాలి.

ప్రతి మనిషి 'నేనూ'—'నా' అనే గాక
'మేమూ'—'మనమూ'—అనే స్థితికి రావాలి.
మనిషి ఎదగాలి
మరెంతో పెరగాలి.

తన సుఖంతోపాటు
ఎదుటివాడి సుఖాన్ని కాంక్షించాలి,
ఆ పరివర్తనే
నవసమాజానికి జీవామృతం,
చరిత్రకి
సువర్ణ కలశం.

అంతేగాని,
పనికిరాని అరుపులతో
ప్రగల్భాల మూకలతో
విప్లవం వస్తుందా ?
వచ్చినా పదికాలాలు నిలుస్తుందా ?

జాతిని జాగృతం చేయడానికి
పవిత్రమైన శాశ్వతమైన
ప్రేమానురాగమే మార్గంకావాలి.

రక్తసిక్తమైన హింసాపూరితమైన
బలిదానం కానేకాదు మార్గం,
విప్లవ సాధనకి ఆధారం
విశిష్టమైన ఉన్నతమైన ఆదర్శం
పొందడానికి ఆత్మపరిశీలన కావాలి
సాధించడానికి ఆత్మస్థైర్యం కావాలి.

అందుకే
మనిషి ఎదగాలి
మరెంతో పెరగాలి.

ఆ దీపం ఆరిపోకూడదు

కలం కదలటంలేదు
గళం పలకటంలేదు
గతం నన్ను విడవటంలేదు
రకరకాల ఊహలు గమ్మత్తుగా
నన్ను లాక్కుపోతున్నాయి
మరో లోకానికి
ఏదో తీరానికి.

పండగలెన్నో వచ్చాయి
పరవశింపజేశాయి, కానీ
దీపావళి రాకకోసం
కళ్లే దిన్వెలుచేసుకు ఎదురుచూశాను.

దీపావళి వచ్చింది
తనతోపాటు మరో వసంతం తెచ్చింది
అందరి మనసుల్లో మకరందం చిందింది.

అన్నదమ్ములు ఆనందంతో
అమ్మవడిలో ఏకమై
దీపావళి జరుపుకున్నారు.

ముగ్గురి బిడ్డల ముద్దుగా చేరదీసి
ఊరడిల్లింది ఆంధ్రమాత

ముగ్గురూ మూడు దారులుగా
విడిపోకూడదని దీవించింది.

చిలిపిచేష్టల చిన్నవాడు
చిచ్చుపెట్టాడు అమ్మమదిలో
నా వాటా నా కిమ్మన్నాడు
దద్దరిల్లింది తెలుగుదేశం
అదిరిపోయింది అమ్మహృదయం.

చిచ్చుపెట్టిన చిన్నవాడిని
చిచ్చికొట్టి పెద్దలు లాలించారు
పలువిధాల నచ్చజెప్పారు
ఆశాజ్యోతిని వెలిగించారు.

ఆ దీపం ఆరిపోకూడదు
అమ్మ హృదయం శోకించకూడదు
అందరం కలిసుండాలి
ఆనందం పంచుకోవాలి.



నవ్వు

—※—

మురిపించే చిరునవ్వూ
నాకు దూరంకాకు నువ్వు.

సుదీర్ఘమైన ఈ జీవనయానంలో
కష్టాలు ఎన్ని ఎదురైనా
బాధలు నన్ను వరించినా
క్రుంగిపోక లొంగిపోక
జయించేశక్తి నీలో వుంది
అదేనాకు కావలసింది.


హృదయంలో అగ్నిపర్వతాలు
బ్రద్దలవుతూన్నా,
మనసు, మమతల జ్వాలల్లోపడి
మాడిపోతున్నా
బంధనాల బాహువుల్లో
బతుకు నలిగిపోతున్నా
నన్ను మరపించే చిరునవ్వూ
నాకు దూరంకాకు నువ్వు.

లోకం నన్ను కాదన్నా
తోడించెవరూ లేకున్నా

నీవు జోడుంటే చాలు
నాకదే పదివేలు.

నువ్వుంటే నా కారోగ్యం
నువ్వుంటేనే ఆనందం
నీ హాసమే నా అందం
నీవల్లనే నాకు సుఖం.

అందుకే
మురిపించే చిరునవ్వూ
వాకు దూరంకాకు నువ్వు.



కుక్కకాటుకు చెప్పుదెబ్బ

అది డిసెంబరు మూడోరోజు
మానవ మారణహోమం సాగిస్తూ
మదాంధులై శత్రువులు
మన భారతదేశంపై
మరఫిరంగులు ప్రయోగించినరోజు.

శాంతికాముకులూ, దయాశీలురూపైన
భారతీయులపై "యూహ్య"
మూర్ఖుడై యుద్ధం ప్రకటించినరోజు.

భారతీయులు శాంతికాముకులేకాని
శక్తిహీనులు కారని
శాంతిపావురం వాడిగోళ్లు
దుష్టశక్తులను దునుమాడినరోజు.

అవసరమయితే అందరం ముందుకువస్తామని
ముక్తకంఠంతో యావద్భారతం
ముందంజ వేసినరోజు.

అబలలుకారు ఆడవారు
ఆత్మాభిమానం కలవారు
అన్యాయం జరిగితే భరించలేరు
ఆకలిగొన్న ఆడపులిలా విజృంభించి

అక్రమాలను అణగారుస్తారు
పంతం పడితే పగబట్టిన వ్రాచుల్లా
ప్రాణాలను సయితం లెక్కజెయ్యక
ఆదిపరాశక్తి లా పోరాడుతారు.

ఎందరో పుణ్యమూర్తులు
మరెందరో త్యాగమయులు
వెలిశారు ఈ వనిలో
నిలిపారు భారతదేశ గౌరవాన్ని.
అది డిసెంబరు మూడోరోజు
చరిత్రలో మరో మలుపు తెచ్చినరోజు.

యవ్వనం చిగురించి
పడుచుదనం పరవళ్లుత్రొక్కే ప్రాయంలో
దంపతుల అనురాగానికి చిహ్నంగా
చిట్టిపాపడు పలుకరించే తరుణంలో
కన్నబిడ్డల ముద్దు ముచ్చటలు చూడ
తల్లితండ్రులు కలలుకనే సమయంలో
శంఖారావం కాగానే
ఫిరంగుల ధమధమలు వినపడగానే
కోరికల దారాలను ఉండకట్టి
హృదయంలో దాచిపెట్టి
వీరాంగనలు,
కర్తవ్యనిర్వహణే కార్యదీక్షగా
వీరతిలకం దిద్ది
మంగళహారతులు పట్టి
సాగనంపారు తను భర్తలను, పుత్రులను

మాతృదేశ రక్షణకోసం
శత్రు శిక్షణకోసం.
ధైర్యసాహసాలకు నిలయమైన మనసైన్యం
అహంకారపూరితుడూ, అజ్ఞానుడూ అయిన
యాహ్యాసైన్యాన్ని చీల్చిచెండాడాను
కుక్కకాటుకి చెప్పుదెబ్బలా, భారతీయులు
యాహ్యాకి బుద్ధిచెప్పారు
ఓహో అనిపించుకుంటున్నారు.

ఆపదలో ఆదుకోవటం మన ఆదర్శం
అధర్మాన్ని అణచి ధర్మాన్ని నెలకొల్పటం మన మతం
దురాశతో దురాక్రమణ సాగించటం కాదు
మన అభిమతం

అ ది ఇందిర, విజయేందిర.

మహిషాసుర మర్దనిలా మన ప్రధాని
యాహ్యామర్దనిగా తలపింపజేసి
సంభ్రమాశ్చర్యాలతో మైమరపింపజేసిన రోజు
విరోధికృత్ వత్సరాంతంలో
విరోధుల కుత్తుకలు
కత్తిరించిన రోజు.

యావద్ ప్రపంచ దిగ్భ్రాంతితో
భారత శౌర్యాన్ని తిలకించిన ఈ రోజు
సామ్రాజ్య నియంత్రత్వాలకు సమాధికట్టిన రోజు
భారత చరిత్రలో సువర్ణలిఖితమైన రోజు
అదే డిసెంబరు మూడో రోజు.

★

మమతల మడతల్లో సంక్రాంతి

వచ్చింది సంక్రాంతి
తెచ్చింది నూతనక్రాంతి
పసుపుపూసిన పండుము త్తెదువలా
విరియబూసింది ముద్దబంతి
కన్నెపిల్ల నిగనిగలా
కన్నుకుట్టిస్తోంది చామంతి
కొ త్తదంపతుల వెచ్చనికోరికలకు
మ త్తెక్కిస్తోంది మంచుతడిసిన చలి
బూజుపట్టిన పాతభా వాలను కాల్చి
కొ త్తపోకడల తిలకాన్నిదిద్దిన భోగిమంట
కాలభై రవునికి మంగళహారతులు పట్టి
కవ్విస్తూ వచ్చింది సంక్రాంతి
కొ త్తకాంతులు తెచ్చింది సంక్రాంతి.

బంగ్లాదేశ ఖానిసత్వాన్ని క్రతించి
భారత్-బంగ్లాలమధ్య
ఎనలేని బంధాన్ని పెంచి
నవ్వుతూ వచ్చింది సంక్రాంతి
పరవళ్లుత్రొక్కుతూ వచ్చింది సంక్రాంతి

ముచ్చటగా ముదితలంతా
రంగురంగుల ముగ్గులేసి

గొబ్బెమ్మలు పెట్టువేళ
సాయంత్రాన సరదాగా
చక్కగా అలంకరించుకు
సంధ్యగొబ్బియను కొలిచేవేళ
సమరాన విజయంతో
వీరులెల్ల ఇళ్లుచేర
సంతోషం వెనవేసుక
వడివడిగా వచ్చింది సంక్రాంతి
సంబరాలు తెచ్చింది సంక్రాంతి.

పండగ ఉత్సాహం ఒకవంక పరుగులెత్తుతువుంటే
విజయగర్వం మరోవంక పరవశింపజేస్తుంటే
కదనంలోని కష్టాలన్నీ
ఋణంలో కరిగిపోయి
హృదయంలోని ఊహలేవో
పురివిప్పి నాట్యమాడ
మధురంగా వచ్చింది సంక్రాంతి
కొత్త మమతలు తెచ్చింది సంక్రాంతి.

పిలుపులో ఏముంది ?

ఏమని పిలిచినా
ఏతీరు పిలిచినా
పిలుపు పలుకుటకేకదా !!
పేరు తెలుపుటకేకదా !!

పిలుపులో ఏముంది ? అంతా
తలపులోనేపుంది, చూపే
మమతలోనేవుంది
దాగిన మనసులోనేవుంది.

మమత నిండిన మనసు
ఎలా పిలిచినా పలుకుతుంది,
మమత లేరుగని మనిషిని
ఏ పిలుపూ అందదు.

పేరు ఏదైనా,
బుజ్జీ, కన్నా, బబ్బీ ఏదన్నా
పలుకుతారు పాపలు.
రామ్, రహీమ్, ఏసూ ఏదన్నా
మొరాలకిస్తాడు దేవుడు
పాపకు ప్రేమ ప్రధానం కాని పిలుపుకాదు,
దేవుడికి భక్తి ప్రధానం కాని పేరుకాదు.

పేరులో ఏముంది ? పిలుపులో ఏముంది ?
ఉన్నదంతా తలపు మలుపులోనే వుంది, అది
మమత నిండిన మనసులోనే వుంది.



రచయిత్రి :
శ్రీమతి శారదా అశోకవర్ధన్

ఉద్విగ్న హృదయాన్ని విప్పి చెప్పుకోడానికి కవిత్వానికి మించిన ప్రక్రియ లేదేమో ! అంగుకే కథలు, కథానికలు వ్రాసిన శారద కవిత్వాన్ని చేపట్టింది. రకరకాల అనుభవాలకు, చలించి ద్రవించిపోయే హృదయం ఆమెకు ఉండనే ఉంది. ఆ అనుభూతులను అందంగా అందిచ్చే నేర్పు కొత్తగా అలవరచుకుంది. ఈమె కవితాహృదయం, ఒక చోట ఆనందంతో వర్తిస్తుంది. ఒక చోట ఆవేశంతో మనల్ని కదిలిస్తుంది. ఒకచోట ఆక్రందనతో మన కళ్ళను చెమ్మగిల్ల జేస్తుంది.

అమ్మనీ, అత్తమ్మనీ గురించి చెప్పేప్పుడు ఆప్యాయత ఒలకబోస్తుంది. వెన్నెలరాత్రిని గురించి చెప్పుతూ, వెచ్చటి ఊహలు మన చుట్టూ అల్లుతుంది. చిట్టిపాప చిరునవ్వులలో చిక్కుబడిపోయిన ఈమె ఆలోచనలు మరుక్షణం హుటాహుటీ సృష్టి రహస్యాలను వెతుక్కుంటూ పోతాయి. అనేక మానసికావస్థలను స్పష్టంగా చిత్రీకరించే సమర్థత, భాషా భేషజానికి లొంగిపోని భావ ప్రాధాన్యత ఈ ఖండికలలో కనిపిస్తుంది.

—పాలగుమ్మి విశ్వనాధం.

Check List

Book Number	MBOG319	Date	24-12-21
Front Cover	YS	Back Cover	YS
Blank Pages	CI, 14, 75		
Missing Pages	ND		
Prepared By	Sk. Shameera	Cutting By	Sk. Shameera
Scanned By	Shameera	Pages	99